క్లుప్తంగా

మక్కా యాత్రికులకు సన్మానం



బాబర్‌ఖాన్, బహదూర్‌లను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: షాద్‌నగర్ నుంచి మక్కా వెళ్తున్న పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, బహదూర్‌లను శనివారం పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారిని నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, రఘు నాయక్, మహ్మద్ ఇబ్రహీం, నవాజ్‌గోరి, హైదర్‌గోరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

మొయినాబాద్: మండల కేంద్రంలో ఐదురోజులపాటు జరిగిన క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. మండల కేంద్రంలో మెథడిస్ట్ జిల్లా యూత్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడాపోటీలు జరిగాయి. జిల్లాలోని 29 చర్చిలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. పోటీల్లో పాల్గొని విజయం సాధించిన జట్లకు, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, డప్పు రాజు, భీంరాజ్, శ్రీధర్, ప్రవీణ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభం

కొందుర్గు: మండల కేంద్రంలో జైభీమ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాపోటీలతో గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం బయటికి వస్తుందన్నారు. ఈ టోర్నమెంట్ ఈ నెల 11 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

శంకర్‌పల్లి: పట్టణంలోని చైతన్య కళాశాలలో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు.

చేవెళ్ల మండల ప్రత్యేకాధికారిగా గోపికృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గోపికృష్ణ

చేవెళ్ల: చేవెళ్ల మండల ప్రత్యేకాధికారిగా సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపికృష్ణ నియమితులయ్యారు. శనివారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ప్రత్యేకాధికారిగా కేటాయించిన సివిల్ సప్లయ్ జిల్లా అధికారి విజయలక్ష్మి బదిలీ కావటంతో ఆమె స్థానంలో వచ్చిన సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణను కేటాయించారు. దీంతో ఆయన మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకున్నట్లు ఎంపీడీఓ హిమబిందు తెలిపారు.

ఏఐటీయూసీ కృషితోనే కూలీరేట్లు పెంపు

చేవెళ్ల: సివిల్ సప్లయ్ గోదాములలో పనిచేసే హమాలీల కూలీరేట్లు ఏఐటీయూసీ కృషితోనే పెరిగాయని జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హమాలీ కూలీల సమస్యలపై ఏఐటీయూసీ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్మిక చట్టాల ప్రకారం హామాలీలకు అన్ని వసతులు, కనీస వేతనాలు అందించాలని పోరాటాలు చేస్తోందన్నారు. ఇప్పటికైనా హమాలీల కూలీ రేట్లు పెరగటం హర్షణీయమన్నారు. పెరిగిన ఈ రేట్లతో పాటు కూలీలకు కొత్త దుస్తులు, ఒప్పందంలో చేసిన విధంగా అలవెన్స్‌లు కూడా దసరా పండుగకు ముందే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఎప్పుడు కార్మికులు, కర్షకుల పక్షాన నిలబడిపోరాడుతుందని చెప్పారు.



షాద్‌నగర్‌రూరల్: అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు



మొయినాబాద్: సురంగల్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

షాద్‌నగర్‌రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలను అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహేశ్వర్మ భాగ్యరేఖ, శ్రీధర్‌వర్మ విజయలక్ష్మి, గిరిబాబు భాగ్యలక్ష్మి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది నవరాత్రి ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో అంజిబాబు, మాధవి, అశోక్, ప్రదీప్, రాజేశ్‌యాదవ్, వెంకటేశ్, అందె మోహన్, అందె శ్రీకాంత్, అందె పైలయ్య, అంజయ్య, రమేశ్, అశోక్, గణేశ్, శ్రీకాంత్, రాజు, కుమార్, బాలు, ఫణీంద్ర, కార్తీక్‌వర్మ, శ్రీదత్తవర్మ, ఆలయ అర్చకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: పూజా కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, తదితరులు

షాద్‌నగర్: షాద్‌నగర్‌లోని మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో ఏర్పాటు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా..

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి, కుమ్మరిగూడ, షాబాద్, సర్దార్‌నగర్, హైతాబాద్, మల్లారెడ్డిగూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో శనివారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. మూడోరోజు అమ్మవారు అన్నపూర్ణదేవీగా దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొయినాబాద్: మండల కేంద్రంతో పాటు సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, నాగిరెడ్డిగూడ, చిలుకూరు, పెద్దమంగళారం, రెడ్డిపల్లి, మేడిపల్లి తదితర గ్రామాల్లో అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు.



షాబాద్: తాళ్లపల్లిలో..



షాద్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం



షాబాద్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ఇంటింటి సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ అందేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ కార్డుల ద్వారా ప్రజలు రేషన్, హెల్త్, ఇతర పథకాలను సులువుగా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం డిజిటల్ కార్డుల జారీని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నట్లు వివరించారు. అధికారులు అర్హుల జాబితాలో వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని కోరారు. డిజిటల్ కార్డుల ద్వారా పలు పథకాల్లో అక్రమాలను పూర్తిగా నిరోధించే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తుందని, పార్టీకి ప్రజల్లో నుంచి వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, నాయకులు సుదర్శన్‌గౌడ్, నవీన్‌చారి, శ్రీను, హరినాథ్‌రెడ్డి, దయానంద్ గుప్తా, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ కార్డు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

సమాజానికి గురువులే మార్గదర్శకులు

విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు వీరస్వామి

షాబాద్: సమాజానికి గురువులే మార్గదర్శకులని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు వీరస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు లింగప్ప, నర్సింలు, బ్రహ్మచారి, సాయన్న, వెంకటయ్య, ప్రభాకర్‌లను ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందని చెప్పారు. ఉపాధ్యాయులు తాము పనిచేసిన చోట అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యాదగిరిచారి, లింగం, పెంటయ్య, యాదగిరి, ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మచారి, నాగలింగం, తదితరులు ఉన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వీరస్వామి

పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది

చేవెళ్ల: మన గ్రామంలోని పాఠశాలను మనమే అభివృద్ధి చేసుకుందామని గ్రామస్తులంతా కలిసి నిర్ణయించుకోవడం సంతోషకరమని దేవునిఎర్రవల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు రాములు, వీరయ్యలు అన్నారు. శనివారం మండలంలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద గ్రామస్తులు, యువకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలందరూ కలిసి ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. సమావేశంలో వారంతా కలిసి గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని దాని ద్వారా పాఠశాల అభివృద్ధి చేసుకుందామని తీర్మానం చేసుకున్నారు. ఈ పాఠశాల అభివృద్ధి కమిటీలో అధ్యక్షుడిగా సామ రంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కరికే శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఎదిరే రమేశ్, కోశాధికారిగా మాణిక్యంగౌడ్‌లతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు సమావేశంలో పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని దీనికి కావాల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని, విద్యార్థులు ఆటలు నేర్చుకునేందుకు స్పోర్ట్స్ యూనిఫామ్, షూతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించుకున్నారు. దీనికి అందరూ కలిసి సహకరించుకుందామని చర్చించుకున్నారు. తమవంతు సహకారం అందిస్తామని గ్రామస్తులు కూడా సమావేశంలో తెలపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, మాజీ సర్పంచ్ సామ మానిక్యరెడ్డి, గ్రామస్తులు జంగయ్యగౌడ్, శివయ్య, కె.సత్యనారాయణశస్త్ర, బి.అరుణ్‌కుమార్, ఈశ్వర్, కమిటీ సభ్యులు, యువకులు ఉన్నారు.

మహాసభకు తరలిన రైతులు

మొయినాబాద్‌రూరల్: కామారెడ్డిలో శనివారం జరిగిన భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభకు మండలం నుంచి రైతులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో రైతులందరినీ ఏకం చేసిన భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి రైతుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేందుకే కామారెడ్డిలో భారతీయ కిసాన్ సంఘ్ మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. రైతు భరోసా, వరికి ఐదు వందల బోనస్, ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సుధాకర్ రెడ్డి, శంకర్, ఈగ వెంకట్‌రెడ్డి, తోల్‌కట్ట శంకర్, శ్రీనివాస్, సుధాకర్, కేతిరెడ్డిపల్లి కృష్ణా, నర్సింహారెడ్డి, శివ, ఆయా గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కామారెడ్డి మహాసభకు తరలివెళ్తున్న రైతులు, నాయకులు

పేద విద్యార్థికి చేయూత

చేవెళ్ల: ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించిన పేద విద్యార్థికి చేవెళ్లకు చెందిన బీజేపీ యువ నాయకుడు మాజీ ఎంపీపీ కుమారుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. శనివారం చేవెళ్లకు చెందిన పారిశుద్ధ్య కార్మికుడు సాయన్న సుజాతల కూతురు హిందూ ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి కాళోజీ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించింది. ఈ సందర్భంగా చేవెళ్లకు చెందిన డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి పేద విద్యార్థి ఉన్నత చదువు కోసం తనవంతుగా లక్ష రూపాయలను ఇస్తానని ప్రకటించి ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థిని కలిసి కుటుంబసభ్యులకు మాజీ ఎంపీపీ ఎం. విజయలక్ష్మి చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించిన సాయన్న దంపతులను అభినందించారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయుతనందించాలని కోరారు. ఎంబీబీఎస్ ఫ్రీ సీటు రావటం ఎంతో సంతోషకరమన్నారు. ఒక డాక్టర్‌గా తనకు తెలిసి పేద విద్యార్థి చదువుకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని ఆలోచనతో తనవంతు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థి కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.



విద్యార్థికి నగదు అందిస్తున్న నాయకుడు డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

షాబాద్: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం కామారెడ్డిలో జరిగిన రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని నాగర్‌కుంట గ్రామానికి చెందిన గడిగె గజేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు విద్యుత్, మార్కెటింగ్, రెవెన్యూ సమస్యలతో సతమవుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో భూముల ఫిజికల్ సర్వే నిర్వహించి హద్దులు నిర్వహిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. సమస్యల పరిష్కారానికి రానున్న మూడు సంవత్సరాల కాలంలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో లక్ష సభ్యత్వంతో పటిష్టంగా ఉన్న భారతీయ కిసాన్ సంఘ్ రైతుల పక్షాన ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆదర్శ్‌నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించండి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు శనివారం డిమాండ్ చేశారు. తమ కాలనీలో ఇప్పటివరకు రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చుకున్నామని, ట్రాన్స్‌ఫార్మర్, ఇంకుడుగుంతలు, పార్కు స్థలాల చదును వంటి కార్యక్రమాలను సొంత డబ్బులు వెచ్చించి అభివృద్ధి చేసుకున్నా మున్సిపాలిటీ నుంచి ఎలాంటి సాయం లేదన్నారు. ఇప్పటికైనా కమిషనర్, చైర్‌పర్సన్ స్పందించి కాలనీలో మురుగునీటి వ్యవస్థ, రోడ్లు, లో-వోల్టేజ్ సమస్య, ప్రతి నిత్యం చెత్త సేకరణ, పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్పందించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

సమయానికి పౌష్టికాహారం అందించాలి

షాద్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయానికి పౌష్టికాహారాన్ని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మఠం రుషికేశ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గుడ్లు, పాలు, బాలామృతం, కందిపప్పు సమయానికి అందించకపోవడంతో బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. పౌష్టికాహార లోపంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రోగాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలకు సరిపడా నిధులను సమకూరుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడంలేదని విమర్శించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సమయానికి పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అణగారినవర్గాల ఆశాజ్యోతి వెంకటస్వామి

షాద్‌నగర్: గుడిసెల వెంకటస్వామి అణగారినవర్గాల ఆశాజ్యోతి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం గుడిసెల వెంకటస్వామి జయంతిని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుడిసెల వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పక్షపాతిగా ఆయన ఎన్నో సేవలు అందించారని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఆయన ముందుకుసాగారన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో వెంకటస్వామి కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, చంద్రశేఖర్, ఇబ్రహీం, జమ్రుద్‌ఖాన్, రాజేందర్‌రెడ్డి, శేఖర్, మల్లేశ్, సీతారాం, అశోక్, గంగనమోని సత్తయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుదాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల ప్రముఖ్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తంగెళ్లపల్లి, ఉమ్మెంత్యాల గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రతీ బూత్‌లో మెజార్టీ సభ్యత్వాలు చేపడితేనే స్థానిక సంస్థల్లో అధిక స్థానాలు గెలుపొందవచ్చన్నారు. పార్టీ నిర్దేశించిన విధంగా సభ్యత్వ నమోదు సాగాలని, షాద్‌నగర్ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకొని ముందుకెళ్తున్నామన్నారు. ఇందుకోసం గ్రామీణ స్థాయి కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలుగా ఉంటూ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్, శివారెడ్డి, గోపాల్, పవన్‌కుమార్‌గౌడ్, రామకృష్ణ, రఘునాథ్‌రెడ్డి, మల్లారెడ్డి, గోపాల్, రమేశ్ పాల్గొన్నారు.

మంగలిగూడలో..

కేశంపేట: మండల పరిధిలోని మంగలిగూడ గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రొల్ల రఘురాం హాజరై మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్దఎత్తున ప్రజలు పార్టీ సభ్యత్వాలను తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, విజయ్‌కుమార్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పవన్‌కల్యాణ్, చెన్నయ్య, వంశీ, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.




సభ్యత్వ నమోదు చేపడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

షాద్‌నగర్‌రూరల్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు బొక్క కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంకనోళ్ల వెంకటేశ్ హాజరై మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోడీ పని చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలని సూచించారు. ప్రతీ బూత్‌లో తప్పనిసరిగా రెండు వందలకు తగ్గకుండా సభ్యత్వాలను నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ, జిల్లా కార్యదర్శి శివశంకర్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ

చేవెళ్ల: మండల కేంద్రంలోని బాలాజీ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం ప్రత్యేక పూజలు, రథోత్సవం, పల్లకీసేవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ఉదయం నుంచే అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



పల్లకీసేవలో పాల్గొన్న అర్చకులు, భక్తులు